క్లుప్తంగా

సీఎం చంద్రబాబును కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



గుంటూరు ఎడ్యుకేషన్: శిథిలావస్థకు చేరిన ఉమ్మడి గుంటూరు జెడ్పీ కార్యాలయ పరిపాలనా భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు కలిశారు. వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జెడ్పీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు. ఈ సందర్భంగా తనకు ప్రభుత్వం తరఫున అధికారిక వాహనాన్ని కేటాయించాల్సిందిగా సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించినట్లు క్రిస్టినా తెలిపారు.

నృత్య పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కర్ణాటక మ్యూజిక్ అండ్ డ్యాన్సర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన కాశీ విశ్వనాథ్ ఆలయంలో జరిగిన శివ తాండవ నృత్య పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని తుమ్మూరు జ్ఞానితి ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నృత్య పోటీల్లో పాల్గొన్న జ్ఞానితి పది ప్రపంచ రికార్డులను సాధించినట్లు వివరించారు. విద్యతో పాటు నృత్య శిక్షణకు తమ పాఠశాల ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అత్తోట సుబ్బారావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి



నగరంపాలెం: జిల్లాలోని వసతి గృహాలు, కేంద్రాలలో ఉండే పిల్లలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో తాత్సారం చేయవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రెండో విడతగా బుధవారం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వర్తించే హోమ్స్‌ను ఆమె తనిఖీ చేశారు. మల్లికార్జునపేట మూడో వీధిలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రం, బృందావన్ గార్డెన్స్, బ్రాడీపేట 6/1వ అడ్డరోడ్డు, ఎస్‌వీఎస్‌కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను సందర్శించారు. అందులో ఉంటున్న పిల్లలతో మాట్లాడారు. వసతి గృహాల్లో సౌకర్యాలు.. పర్యవేక్షణ ఎలా ఉందని అడిగారు. అదే విధంగా నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు విధిగా మౌలిక సౌకర్యాలను అమలు చేయాలని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ జన్మదినం సందర్భంగా బుధవారం ఇజ్రాయిల్‌పేట ఒకటో లైనులోని చర్చి వద్ద గుంటూరు జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుండ్ల రాజాబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. అభిమానులు మహిళలకు చీరలు, పిల్లలకు, పెద్దలకు పండ్లు పంపిణీ చేశారు. రాజాబాబు మాట్లాడుతూ మనసున్న మంచి మనిషి, మానవతావాది ప్రభాస్ అన్నారు. కోవిడ్‌తో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పెద్ద ఎత్తున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వానికి అందించి, బాధితులకు బాసటగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు మల్లేపల్లి రమేష్, ఎస్కే మస్తాన్, నాగమల్లి, పి. ఇజ్రాయేలు, మాచవరపు బుడ్డి, వై.దాసు, వై. మహేష్, వై. శామ్యూల్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మాయ వ్యాపారం

- బహుమతుల పేరిట బురిడీ
- కొత్త మోసాలతో డబ్బు వసూలు
- ఆందోళనలో బాధితులు

లక్ష్మీపురం: ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లలో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు వీక్షకుల్ని బుట్టలో పడేస్తాయి. ఏదైనా ఒక వస్తువును బుక్ చేసుకుంటే నిమిషాల వ్యవధిలో నగదు లేదా కలర్ టీవీ, యాపిల్ ఫోన్, ద్విచక్ర వాహనం వంటి వాటిని డ్రాలో బహుమతిగా పొందవచ్చంటూ ఊదరగొట్టేస్తారు. ఆన్‌లైన్ పెట్టుబడుల పెట్టడం వల్ల కోట్ల రూపాయాలను ఇంటి వద్దనే ఉండి సంపాదించవచ్చు అంటూ వచ్చే ప్రకటనలకు ఆశపడి ఎందరో అమాయకులు అడ్డంగా బుక్కవుతున్నారు. ఈ తరహా బాధితుల్లో గుంటూరు చెందిన ఓ మహిళ రూ. కోటికి పైగా మోస పోగా, మరో మహిళ వేలల్లో నష్ట పోయింది. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మరి కొందరు దిక్కుతోచని స్థితిలో ఉండి పోతున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ మోసం

గుంటూరు పశ్చిమ పరిధిలోని నలందా నగర్ ప్రాంతానికి చెందిన ఓ గృహిణి ఈ ఏడాది ఏప్రియల్ 24న ఇంటి పనులు పూర్తి చేసుకుని రోజు మాదిరిగానే ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ద్వారా రీల్స్, ఫేస్‌బుక్, వాట్సప్ పరిశీలిస్తున్నారు. అదే సమయంలో ఫేస్‌బుక్‌లో నుంచి మౌంట్.కమ్ అనే యాప్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయడం ద్వారా ఇంటి వద్దే రూ. లక్షలు సంపాదించుకోవచ్చని ఉండటంతో దాన్ని ఆమె క్లిక్ చేసింది. యాప్ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టడం వల్ల అధిక లాభాలను ఆర్జించవచ్చని మరలా మెసేజ్ వచ్చింది. దీంతో ముందుగా ఆ గృహిణి కొంత నగదును ట్రేడింగ్ ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. దానికి జోడించి కొంత నగదు లాభంగా వచ్చింది. దీన్ని మరలా ట్రేడింగ్‌లో మరి కొంత నగదు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసింది. మరలా కొంత లాభం నగదు ఆమె ఖాతాలోకి వచ్చింది. దీంతో ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు ట్రాన్స్‌ఫర్ చేయడం ప్రారంభించింది. ఇలా కొన్ని యాప్ ద్వారా లావాదేవీలు జరిగాయి. ట్రేడింగ్ యాప్ ద్వారా ఇక నుంచి డైరెక్ట్‌గా బ్యాంక్ ఖాతా, క్రెడిట్ కార్డు ద్వారా అయితే మంచి లాభాలు ఆర్జించవచ్చని మెసేజ్ వచ్చింది. దీంతో



ఆన్‌లైన్ షాపింగ్ యాప్ (ఫైల్)

ఆ గృహిణి ఆన్‌లైన్ ట్రేడింగ్ మాటలు నమ్మి హెచ్‌డిఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా నగదు కొంత ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఆ గృహిణి హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాలో రూ.1,27,06712 కోట్లు నగదు మాయం అయింది. దీంతో ఆ గృహిణి యాప్‌కు సమాచారం తెలియజేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. ఆ యాప్, ఆన్‌లైన్ ట్రేడింగ్ పూర్తి మాయం అయిపోయింది. దీంతో దిక్కుతోచక ఆ గృహిణి సెప్టెంబర్ 25న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లక్కీ డ్రా అంటూ ఆశలు

నగరంలోని అమరావతి రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏడాది క్రితం ఆన్‌లైన్ షాపింగ్ చేయడం వల్ల రెండు నిమిషాల్లో ద్విచ క్రవాహనం లేదా ఏదైనా ఆకర్షణీయమైన బహుమతిని లక్కీ డ్రా ద్వారా అందిస్తామని చెప్పడంతో నమ్మి కొనుగోలు చేసింది. మిక్సీ వారం రోజుల్లో ఆమెకు చేరింది. ఏడాది పూర్తయ్యాక ఇటీవల ఆమెకు పోస్టల్ ద్వారా వీపీపీ లెటర్ పేరుతో ఓ కవర్ వచ్చింది. ఆ సమయంలో పోస్ట్‌మాన్ కవర్‌లో ఏమి లేదని చెప్పి వెనక్కి తీసుకెళ్ళాడు. తర్వాత బాధితురాలుకు ఓ ఎగ్జిక్యూటివ్ ఫోన్ చేసి "మీరు గత ఏడాది ఓ మిక్సీని కొనుగోలు చేసినందుకు కంపెనీ రూ.25 లక్షల చెక్కును పంపించింది. దాన్ని తీసుకోవాలంటే రూ.25 వేలు చెల్లించి తీసుకోవా"లని చెప్పాడు. వెనక్కు పంపిన కవర్‌ను మరలా ఆమె వద్దకు వచ్చింది. రూ.25 లక్షల చెక్కు తమకు బహుమతిగా వచ్చిందని నమ్మిన బాధితురాలు ఎంతో ఆశతో రూ.25వేలను మెడలో ఉన్న బంగారు గొలుసును తాకట్టు పెట్టి మరి చెల్లించి తీసుకుంది. కవర్‌ను తీసి చూస్తే లోపల ఓ తెల్లకాగితం పై ఓ మొబైల్ నంబర్‌తో ప్లీజ్ కాల్‌మీ ! అని రాసి ఉంది. లోపల చెక్కు ఉన్నట్టుగా బయట నుంచి తెలియడం కోసం కవర్ లోపలి బ్యాగులో తమిళ పేపర్ పెట్టి ఉంది. దాన్ని చూసి బాధితురాలు అవాక్కైంది. మళ్లీ ఆ కవర్‌లో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేసింది. "మీకు కవర్‌ను ముందుగా సరైన చిరునా



ఆన్‌లైన్ ట్రేడింగ్ మౌంట్ యాప్

మాకు పంపిచమామా లేదా అని ముందుగా ఓ ట్రిల్ వేశాం.. మీకు రెండు రోజుల తరువాత రూ.25 లక్షల చెక్కు వస్తుంది " అని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి నమ్మబలికాడు. ఆ కవర్ వచ్చి కూడా ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకు అతీగతి లేదు. ఆ ఫోన్ నంబర్ కూడా పని చేయడం లేదంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

నిఘా నిల్

ఒక్క గుంటూరులోనే కాదు చాలా ప్రాంతాల్లో పలువురు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసి మోసపోతున్నారు. కొన్ని చోట్ల ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ బాధితులు వాపోతున్నారు. తపాల శాఖ కూడా ఇలాంటి బిజినెస్ పార్శిళ్లు పంపే సమయంలో దానికి సంబంధించిన సమగ్రమైన వివరాలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి

అవగాహన, అప్రమత్తతతోనే క్యాన్సర్ నిర్మూలన

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్ : అవగాహన, అప్రమత్తతోనే క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో బుధవారం సత్కార సభ నిర్వహించారు. క్యాన్సర్ రోగులకు అంకితభావంతో సేవలందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, నాట్కో క్యాన్సర్ సెంటర్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ టీవీ శివరామకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఏ జాహ్నవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్. మురళి, డాక్టర్ టి. వెంకట్‌రెడ్డి, డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ కుమారిలను ఘనంగా సత్కరించారు. సభలో డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీవన శైలిలో



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్. వేదికపై యడ్లపాటి అశోక్ కుమార్ తదితరులు

మార్పు ద్వారానే క్యాన్సర్ అరికట్టగలమని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్‌లో వైద్యం అందిస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. క్యాన్సర్ రోగులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అన్ని రకాల పరీక్షలు, శస్త్ర చికిత్సలు, మందులు, పేషెంట్‌తో పాటు సహాయకులకు భోజన సదుపాయాలను అందిస్తున్నట్లు తెలిపారు. నాట్కో క్యాన్సర్ సెంటర్ రేడియో థెరపీ విభాగాధిపతి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ఆలోచన వేదిక వంటి స్వచ్ఛంద సంస్థల గుర్తింపు ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. నాట్కో కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ త్వరలో రూ. 20 కోట్ల వ్యయంతో మరొక 150 పడకల అదనపు భవన నిర్మాణం నవంబరు నెలలో ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవల మీద గౌరవం పెరిగేలా నాట్కో క్యాన్సర్ ఆసుపత్రిలో తన భార్యకు గత ఐదు నెలలుగా చేస్తున్న చికిత్సలకు గుర్తుగా వైద్యులను, నర్సింగ్ సూపరింటెండెంట్‌లను సత్కరించడం సామాజిక బాధ్యతగా భావించినట్లు వివరించారు. సందర్భంగా సమాజ సేవకుడు వల్లూరు సదాశివరావు నాట్కో క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 50 వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మా కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ రామారావు, డైటీషియన్ పీరూ సాహెబ్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. చంద్రశేఖరరావు, నర్సింగ్ సిబ్బంది, రోగుల సహాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం అదనపు కమిషనర్‌తో కలిసి డెప్యూటీ కమిషనర్, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లగా వారీగా వసూళ్లపై సమీక్షించారు. పన్ను వసూళ్లలో పురోగతి ఉండాలని ఆదేశించారు. తదుపరి సమావేశానికి పాత బకాయిల వసూళ్లు, సర్వేలో గుర్తించిన సుమారు నాలుగు వేల ఆస్తులకు నూతన పన్ను విధింపులో పురోగతి ఉండాలని తెలిపారు. వసూళ్లకు రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారీగా కమర్షియల్, రెసిడెన్సీలను రీ చెక్ చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల బకాయిలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సచివాలయం పరిధిలో నూరు శాతం డిమాండ్ నోటీసులు అందించాలని, రెవెన్యూ అధికారులు క్షేత్ర



అధికారులతో సమావేశమైన కమిషనర్

స్థాయిలో పంపిణీని క్రాస్ చెక్ చేయాలని చెప్పారు. పన్ను వసూళ్లలో నిర్దేశిత మేరకు పురోగతి లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యాష్ కౌంటర్లలో నీటి పన్ను చెల్లించిన తర్వాతనే ఆస్తి పన్ను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి పన్ను బకాయి చెల్లించని వారికి ట్యాప్ కనెక్షన్ తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్.ఓబులేసు, డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు రెహమాన్, రవికిరణ్ రెడ్డి, శివన్నారాయణ, సాధిక్ బాషా, సూపరింటెండెంట్ వెంకటరామయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శత జయంతిని విజయవంతం చేయండి

సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి

లక్ష్మీపురం: డిసెంబర్ 26కు సీపీఐ 100 సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా గుంటూరు నగరంలోని అన్ని శాఖలు సమావేశాలతో పాటు పతాకాలు ఆవిష్కరించుకొని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో వాటర్ హాకర్స్ సీపీఐ శాఖ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిందారీ వ్యవస్థ, రాజభరణాల రద్దుతో పాటు పేదలకు వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో సీపీఐ ఘనమైన పాత్ర పోషించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి ఎనలేని త్యాగాలు చేసిన గొప్ప పార్టీ అని పేర్కొన్నారు. వార్షికోత్సవాలను పురస్కరించుకొని నగరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అందులో భాగస్వాములు కావాలని కోరారు.నగర కమిటీ సభ్యులు చల్లా మరియ దాస్, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1925లో ఏర్పడిన సీపీఐ స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేకంగా పోరాడి అనేక సమస్యలకు పరిష్కారం చూపిందని తెలిపారు. కార్యక్రమంలో వాటర్ హాకర్స్ శాఖ కార్యదర్శి దూపాటి వెంకటరత్నం, సురేష్, నారాయణ, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, శీను, అంజి పాల్గొన్నారు.

ఫుట్ పాత్‌పై ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ తొలగింపు



లాడ్జి సెంటర్‌లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్



తొలగించిన అనంతరం

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: లాడ్జి సెంటర్ ఏఎల్ బీఈడీ కాలేజీ కాంపౌండ్ అనుకుని పుట్‌పాత్‌పై ఓ ఫాస్ట్‌ఫుడ్ దుకాణం కొత్తగా వెలసింది. దీనిపై సాక్షి దినపత్రికలో 21వ తేదిన 'దొరికితే జాగా..వేసేయ్ పాగా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది బుధవారం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను తొలగించారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

లక్ష్మీపురం: నిత్యం మద్యం తాగి భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణబాబు కాలనీకి చెందిన ఎం.ధనలక్ష్మికి అర్జున్‌రావుకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కొంతకాలంగా అర్జున్‌రావు మద్యానికి బానిసై భార్య ధనలక్ష్మిని వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి పూటుగా మద్యం తాగి భార్యపై దాడి చేయడంతో కంటికి గాయమైంది. స్థానికుల సహాయంతో ధనలక్ష్మి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందింది. భర్తపై బుధవారం రాత్రి నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 34 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బుధవారం గుంటూరు కమాండింగ్ ఆఫీసర్ సుదర్శన్ ఏ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం. ఎం ఏడుకొండలు ఎంఈవోలు ఏహెచ్‌వీ ప్రసాద్, రాయల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి ఎన్‌సీసీ ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఉన్నత విద్యలో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని, దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ టీచర్ దుర్గాబాయి, ఉపాధ్యాయిని ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

జోరందుకున్న రైల్వే గుర్తింపు ఎన్నికల ప్రచారం

లక్ష్మీపురం: రైల్వే గుర్తింపు ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ సెక్రటరీగా పోటీ చేస్తున్న సీహెచ్. శంకరరావు బుధవారం గుంటూరు రైల్వే స్టేషన్, నంబూరు స్టేషన్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు గుంటూరు డివిజన్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయతీలతో పని చేసే మజ్దూర్ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికుల డిమాండ్స్ సాధించడంలో ముందుండి పోరాడుతామని తెలిపారు. రాబోయే ఎన్నికలలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌ను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. మజ్దూర్ యూనియన్‌కు ఎలాంటి రాజకీయ పార్టీల అండదండలు లేవని, కార్మికుల నుంచి పుట్టిందని గుర్తు చేశారు. అనంతరం స్థానిక గుంటూరు పట్టాభిపురంలో ఉన్న గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్ఎం రామకృష్ణను శంకరరావు, యూనియన్



నాయకులతో మాట్లాడుతున్న యూనియన్ జోనల్ సెక్రటరీ శంకరరావు

నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గుంటూరు రైల్వే డివిజనల్ మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ కోటేశ్వరరావు, డివిజన్ సెక్రటరీ ఎం.వి ప్రసాద్, డివిజన్ ప్రెసిడెంట్ మంజునాథ్, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలు కరుణశ్రీ, లావణ్య, జోనల్ వర్కింగ్ కమిటి సభ్యులు కె.వి.ఎస్ ప్రసాద్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ నిర్మాణం

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: శంకర్ విలాస్ సమీప వ్యాపారస్తులకు ఇబ్బందులు లేకుండానే ఫ్లైఓవర్ నిర్మించేందుకు కృషి చేస్తామని కేంద్ర వ్యవసాయ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. బ్రిడ్జ్ నూతన నిర్మాణం కారణంగా కొందరు వ్యాపారస్తులకు నష్టం కలగడంతోపాటు ఉపాధి కోల్పోయే అవకాశముందని బ్రాడీపేట బిల్డింగ్ ఓనర్స్, షాప్ కీపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో బ్రిడ్జ్‌పునర్ నిర్మాణం చేపట్టామన్నారు. వీలైనంత వరకు స్థానికులకు ఇబ్బంది కలగకుండానే డిజైనింగ్ చేయిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నారాయణ మూర్తి, హరీష్, సుబ్బారావు, గురుదత్ పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారస్తులు

మలినేని కళాశాలలో హాకథాన్ ఎక్స్‌పో

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మేక్ స్కిల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో 36 గంటల హాకథాన్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్వీఆర్‌జేసీ, ఎస్‌పీటీపీ ఫౌండేషన్ పీఓ డాక్టర్ మహేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా నేటి సాంకేతిక రంగంలో పోటీపరంగా కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని సూచించారు. మేక్‌స్కిల్డ్ పీఓ పి.మధు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యతలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని తెలిపారు. మలినేని సంస్థల అధినేత డాక్టర్ పెరుమాళ్లు మాట్లాడుతూ మహిళ ఇంజినీరింగ్ విభాగంలో మలినేని విద్యార్థులు ఇన్నోవేటివ్ ప్రాజెక్టులతో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టాలని చెప్పారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎక్స్‌పో స్టాల్స్‌ను అతిథులు సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, డైరెక్టర్ శ్రీనివాసకుమార్, చార్లెస్ జయరావు, డాక్టర్ రవికిరణ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఎక్స్‌పోలో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందజేశారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అతిథులు

రక్తదానంతో ప్రాణాలు కాపాడిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.విద్యాసాగర్‌రెడ్డి, ఎస్కే కాశీ, వై. చందు, జి. నరేంద్ర బాబు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో ఉన్న బాధితునికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి తెలిపారు. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రాణాపాయంలో ఉన్న బాధితులకు రక్తం అందించడంలో ఎప్పుడూ ముందుంటారని, సామాజిక సేవా భావాలను అలవర్చుకున్న తమ విద్యార్థులు కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయశైలజ విద్యార్థులను అభినందించారు.





రక్తదానం చేస్తున్న విద్యార్థులు

స్కేటింగ్ పోటీల్లో జెనీష్‌కి ప్రథమ స్థానం

గుంటూరు ఎడ్యుకేషన్: నవంబర్ 22 నుంచి జరగనున్న జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు భారతీయ విద్యాభవన్స్ విద్యాశ్రమంలో 6వ తరగతి చదువుతున్న యంగలశెట్టి జెనీష్ విశ్వసాయి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.హేమాంబ తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 18,19,20వ తేదీల్లో కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జెనీష్ జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడని తెలిపారు. రెండు బంగారు పతకాలు సాధించిన తమ విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి జెనీష్ విశ్వసాయితో పాటు కోచ్ ఇమ్రాన్‌ఖాన్‌ను పాఠశాల కార్యదర్శి పి. రామచంద్రరాజు అభినందించారు.



జెనీష్ విశ్వసాయిని అభినందిస్తున్న రామచంద్రరాజు, హేమాంబ